# దావతు (విందు)

కొత్తగావచ్చిన గిర్దావరు (రెవిన్యూ ఇన్స్పెక్టరు) మోటారు దిగాడన్న సంగతి తెల్వటమే ఆలస్యం పటేలు, పట్వారీ, సేక్‌సిందీలు ఎదురుకోవటానికి వచ్చి చావట్లో విడిది చేయించారు. ఆయన మోటారు దిగిన అర్ధగంటకే పెద్ద గుట్టంసైసు, ఆయన వెంటవుండే బావర్చీ వెంట వంట సామాను వగైరాలన్నీ పన్నెండుమంది వంతు చాకళ్ళు మాదుగుల మీదినుంచి దించారు. గిర్దావర్ సా॥కు చేదోడు వాదోడేమిటి కుడిభుజంగా వున్న చందా సా॥ కూడా చేరుకున్నాడు. చందా సా॥ వచ్చే గిర్దావర్లందరి దగ్గర జీతం బత్తెంలేని నౌకరు. అతనికేం గిట్టుబాటంటే గిర్దావర్లతోపాటు పుణ్యానికి వచ్చే వెట్టికోళ్ళ కూరలతో భోజనం. ప్రతి ఊళ్లో గిర్దావర్ సా॥ దగ్గర ప్రధానమంత్రి లాంటివాడు. యథోచిత సంభావన సత్కారం. ఈ విధంగా తిండి పోగా నెలకు 100 రూపాయలకు చావులేదు. గిర్దావర్ మీద భారం లేదు. ప్రతి గిర్దావరుకు కూడా చందా సా॥ వంటివారుంటే దర్బాషాన్, గౌరవ ప్రపత్తులకు లోటులేదు. ఆదాయానికి కూడా కారకుడన్న దృష్టితో ప్రతి గిర్దావరు బదిలీ అయిపోతూ వచ్చే గిర్దావరుకితణ్ణి దత్తతచేసి పోతుంటారు.

గిర్దావరు తన పని చేసుకుంటున్నాడు. పటేలు పట్వారీలంతా ఆయనతోపాటే వున్నారు. 12 గంటలైంది. కడుపులో ఎలుకలు పరుగెత్తటం మొదలు పెట్టినయి – 'ఖానా లావ్' అన్నాడు బావర్చీని.

"ఇంతవరకు సామాను రాలేదు సర్కార్"

"కుమ్మరోండ్లు, చాకలోండ్లు ఎక్కడికి పోయినారు. వాళ్ళను కోమటిండ్లకు బంపితే సామానొచ్చేది. ఇంతమాత్రం తెల్వదు బే. బేహాయా యెక్కడో."

"నేనూ చందాసా॥ తిర్గి వచ్చినం, మొదలు పైసలిస్తె సామా నిస్తం లేకుంటే లేదంటున్నరు కోమట్లు."

"నీవు దిర్గటమేమిటి కుమ్మరి కుక్కలకొడుకు లేడా? పోవటానికి-యీ వూరు గమ్మతు వూరే వున్నట్లున్నది."

"వాళ్ళుకూడా పైసలిస్తేనే పని చేస్తమన్నరు."

"కోమట్లు, పనిబాటలోండ్లు విలాయత్ (లండను) నుంచి దిగివచ్చి నట్లున్నది. నేను పుట్టినప్పట్నించి ఇటువంటి ఊరు చూడలేదు."

చందాసాబు ముందుకొచ్చి విన్నవించును "సర్కార్ ఇది మాదర్చోత్ వూరు. ఈ వూళ్ళోళ్ళంతా బద్మాషు లయ్యిండ్రు. ఎవరి మాట లక్ష్యం లేదు. అదుపాజ్ఞల్లేవు. ఆర్యసమాజమా యేమిటి. మా గుల్బర్గా హల్కాలో ఒక ఆర్యసమాజీ వుండేవాణ్ణి హరో హరా అని పించినా. వీళ్ళ ఆటలు నా దగ్గర సాగవు."

పటేలందుకున్నాడు-"ఇన్నాళ్ళ టూరు"గాదిది చానా చెడిపోయింది. దొరవారికి, మాకు వెట్టి అరకలు దున్నేది పోయింది. పెంట గొట్టేది పోయింది. మావంటివాళ్ళొస్తే ఎడ్లకు గడ్డి దొరికేది. మీవంటి పెద్దల గుఱ్ఱాలొస్తె కోమట్లు దాణకు శనగ లిచ్చేవాళ్ళు - అంతా పోయింది. ధర్మరాజు లాంటి ధొరవారు కూడా నౌకర్ల పెట్టి పని చేయించుకుంటు న్నారు. ధొరవారి పనే ఇట్లైతే ఇంక మావంటి వాండ్లు లెక్కేమిటి. చాలా కంగారైపోయింది" అని గోడు వెళ్ళబోసుకున్నాడు.

సేత్రందీ మొదలు పెట్టాడు. "పోయిన గిర్దావరు కూడా మీవంటి మంచి ధొరే నండీ. చందాసాబు నడగండి ఆయనతో కూడా కొట్లాడు కునేది యీ వూరు వాళ్ళు. లేవీ తఖ్తాలు తప్పు రాసిండని, లంచాలు తీసు కున్న వాండ్లకు మాఫీలిచ్చి అసలు ఫైళ్ళు జెడ్డవాండ్లకు మాఫీ లివ్వ లేదని గిర్దావరు సాబు మీద ధర్ఖాస్తిచ్చినారు. అందుకే ఆయన తబాదిలా అయిండని, యీ గెల్పు తమదేనని చెప్పుకుంటున్నారు."

పట్వారి అందుకున్నాడు - తహశీల్దారు ధర్మ ప్రభువండీ. సేగే దారీ (క్లర్కు) నుండి తహశీల్దారైనాడు. ఆయనకి సంగతులన్నీ తెలుసు. మన కష్ట సుఖాలు తెలిసినోడుంటబట్టిగాని లేకుంటే చాలా కష్టమేవుండేది. అని మాటలు పెంచుతున్నాడు. మధ్యన పటేలందుకొని అన్నాడు. 'మా పట్వారి చిన్నాయిన కొడుకే సర్కార్ ఈ వూళ్ళో పెచ్చుబెట్టింది.'

'మీవాడే అయితే వాణ్ణి అదుపులో పెట్టలేవు-నాకాకలవుతున్నదిభై' అన్నాడు గిర్దా వారు.

"వాండ్లకు మాకు పడదండీ. నన్నీ యింత మోత్తల్ (సస్పెన్షన్), వకాకూన్ (డిస్మిస్డ్) చేయించి పట్వారీగిరి ఊడగుంజు కుందామని ఈ యెత్తులండీ." ఆ మధ్యలో యుక్తిగా అంటించాడు పట్వారీ.

"సరే, ఆ మాట అటు తర్వాత చూసుకోవచ్చుగాని నా తిండి మాటేమిటి. పైసలిచ్చి కొనుక్కునే అలవాటు నాజిందగీ భర్ లో (జీవితం యావత్తులోను) కానివ్వను. ఇది మాషాన్ మస్లా (పరువు సమస్య).

"అయితే మా యింటి నుంచి అన్నం పంపిస్తా లేకుంటే తమరే రాండి తినిపోదురుగాని" పట్వారీ అన్నాడు.

ఇంతలోకే లాగు, షేర్వాని, రూం టోపితో ఒక బాన కడుపు వ్యక్తి ప్రత్యక్షమైనాడు ఆదాబ్ అదా అంటూ. పట్వారి చెప్పినాడు. "ఈయనే మా వూరి దొర. చాలా మంచివాడు. ఇంతకు పూర్వం వీరిపేరు జెపితే పిట్టలు నీళ్ళు దాగేవి కావు - మంచి అదుపాజ్ఞల్లో వుంచేవా"డని.

దొర అందుకున్నాడు. "అదంతా పాతకాలం ముచ్చట. యీ కలి యుగంలో దుర్బుద్ధి లెక్కువైనై. రాగాకు కొసకొచ్చింది. వినాశకాలం దాపురించింది. పెరుగులో వెన్న ముద్ద సగం మునుగు తున్నది తొందర్లో మునుగుతుందీ ప్రపంచం, యెక్కడ జూచినా కలి పుత్రులే" అంటూ అల వాటు ప్రకారముగా వేదాంతం చెప్తున్న దొర ఒక్కసారిగా మాటలు మార్చి, "మీరెక్కడ నుంచి రావడం?" అని కుశల ప్రశ్నలకు తగులుక్కొన్నాడు.

"మీ వంటి వాండ్లుండికూడా వూరు యిట్లా చెడి పోతుంటే చూస్తు న్నారు. ప్రతి వూరు కూడా యింత బద్మాష వూరైతే మన రాజ్యం కూడా అగదు, ఇక యీ వూరు నుంచి నా సామానెట్ల బోవాలో తోచదు." కడుపులో ఆకలి మంట గిర్దావార్-ఆందోళన వెలిబుచ్చాడు.

"అరె అట్లనా, నా కెందుకు చెప్పలేదయ్యా పంతులూ, మా బంగ్లా మీద దిగనుంటిరి. పదండి మా యింటికి నాష్తాచేతురుగాని, సంగతులన్నీ అక్కడ మాట్లాడొచ్చు నడవ్వయ్యా చందాసాబు" అందరినీ ఆహ్వా నించారు దొరవారు.

పీడ విరగడైందని చెవులు ఝాడించి యిల్లుచేరుకున్నాడు. పట్వారి పటేలు గిర్దావారు వెంట దొరవారి యింటికి చేరుకున్నాడు గిర్దావరుకిచ్చే దావత్‌లో తనకూ భాగం దొరక్కపోతుందా అని .... .... ....

(1947)